7

సాక్షి అనకాపల్లి

మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025

క్లుప్తంగా

వైద్యుల సమ్మె బాట

- నిలిచిన ఓపీ సేవలు



పి.పి.అగ్రహారంలో ఓపీ సేవలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మాకవరపాలెం: వైద్యుల సమ్మెతో పలు పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు నిలిచిపోయాయి. డాక్టర్ల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసనలో భాగంగా సోమవారం మాకవరపాలెం, బూరుగుపాలెం పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు నిలిచిపోయాయి. దీంతో సిబ్బందే రోగులకు మందులు ఇచ్చి పంపించారు. అలాగే పి.పి.అగ్రహారంలో నిర్వహించిన స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరంలోనూ సిబ్బందే ఓపీ సేవలు అందించారు. ఈ నిరసనలో వైద్యాధికారులు సీతారామలక్ష్మి, చరిష్మ, శ్రీనివాసరావు, చరణ్ ఓపీ సేవలను బహిష్కరించారు.

చివరి మజిలీకి ఎన్ని కష్టాలో..



పెద్దేరు నది నీటిలో నుంచి మృతదేహాన్ని మోసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

బుచ్చెయ్యపేట: మండలంలో వడ్డాది మేజర్ పంచాయతీలో మృతదేహాన్ని ఖననం చేయడానికి బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర అవస్థలు పడ్డారు. సోమవారం వడ్డాదిలో కొత్తూరుకు చెందిన ముత్యాల గణేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. దళితులు, దేవాంగులు, స్వర్ణకారులు, కమ్మర్లకు చెందిన శ్మశానవాటిక ఇక్కడ మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఎస్సీ బాలుర వసతి గృహం ఎదురుగా పెద్దేరు నది ఒడ్డున ఉంది. గతంలో పెద్దేరు కస్పా కాలువపై సిమెంట్ గొట్టాలు పరిచి రోడ్డు వేశారు. ఈ రోడ్డుపై వెళ్లి మృతదేహాలను ఖననం చేసేవారు. ఇటీవల వర్షాలకు సిమెంట్ గొట్టాల రోడ్డు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. నడుం లోతు నీటిలో నుంచి అతికష్టం మీద శ్మశాన వాటిక వరకు మృతదేహాన్ని మోసుకెళ్లి ఖననం చేశారు. ఇప్పటికైనా శ్మశాన వాటికకు వెళ్లే రహదారిని బాగు చేయడమే కాక వేరే దగ్గర తమ కులాల వారు అంత్యక్రియల నిర్వహణకు స్థలం కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కట్టలు తెగిన ఆగ్రహం

మంత్రి.. అందులోనూ హోంమంత్రి.. **కట్టుదిట్టమైన బందోబస్తు.. భారీ సంఖ్యలో మోహరించిన పోలీసులు..** ఎక్కడికక్కడ రోప్‌వేలు. **ఇవేవీ మత్స్యకారులను నిలువరించలేకపోయాయి. తాము నిరసన చేపట్టిన 15 రోజుల తర్వాత వచ్చిన తమ ప్రజాప్రతినిధి,** రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి **అనితకు తమ ఆగ్రహావేశాలు ఎంతటివో తెలియపరిచారు. ఆమె** వాహనాన్ని అడ్డుకున్నారు. తాటి**చెట్టును అడ్డంగా** పెట్టారు. రోడ్డుపై బైఠాయించారు. **వారిని పోలీసులు** కట్టడి చేయలేకపోవడంతో మరో **దారి లేక స్వయానా** అనిత రంగంలోకి దిగారు. వాహ**నం డోర్ తెరచుకొని** ఆందోళనకారులను ఉద్దేశించి మాట్లాడారు. బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చి వారిని శాంతపరిచారు.



సభలో మత్స్యకారులను శాంతింపచేసేందుకు ప్రయత్నిస్తున్న హోం మంత్రి అనిత

- గంగపుత్రుల వీరావేశం
- హోంమంత్రికి నిరసన సెగ
- వాహనం అడ్డగించిన మహిళలు
- నిలువరించలేకపోయిన పోలీసులు
- బల్క్‌డ్రగ్ పార్కు రద్దుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో శాంతించిన మత్స్యకారులు
- శుష్క వాగ్దానాలు వద్దని, పనులు ఆపితేనే మాట్లాడతామని స్పష్టీకరణ



తాటి చెట్టును అడ్డుగా పెట్టి హోం మంత్రి అనిత కారును అడ్డుకుంటున్న మత్స్యకారులు



హోం మంత్రి అనిత కారును అడ్డుకున్న మత్స్యకారులు

నక్కపల్లి: తమ జీవితాలను నాశనం చేసే బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటును నిరసిస్తూ మత్స్యకారులు చేస్తున్న నిరాహార దీక్ష రెండు వారాలుగా కొనసాగుతోంది. ఉద్యమం తీవ్రతరమై వేలాదిమంది మత్స్యకారులు రోడ్డెక్కి ఆందోళన కొనసాగిస్తున్నారు. పనులు మానుకుని కుటుంబాలతో సహా నిరసన దీక్షలో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో మత్స్యకారులతో మాట్లాడేందుకు రాజయ్యపేట వచ్చిన హోంమంత్రి అనితకు నిరసన సెగ అంటుకుంది. ఆగ్రహావేశాలతో రగిలిపోతున్న మత్స్యకారులను అడ్డుకోవడం పోలీసుల తరం కాలేదు. మంత్రి ప్రయాణిస్తున్న వాహనాన్ని ముందుకు వెళ్లకుండా వేలాదిగా తరలివచ్చిన మత్స్యకారులు అడ్డుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో రోడ్డుపై బైఠాయించి బల్క్‌డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలని నినాదాలు చేశారు. పోలీసులు పట్టుకున్న రోప్‌వేలు మత్స్యకారులను ఏమాత్రం నిలువరించలేకపోయాయి. భారీగా మోహరించిన పోలీసులు మత్స్యకారులను ఏమాత్రం అడ్డుకోలేకపోయారు. తీవ్ర వాగ్వాదాల మధ్య మత్స్యకారులను శాంతింపచేసేందుకు హోంమంత్రి తీవ్ర ప్రయత్నం చేశారు. తొలుత అధికారాన్ని ఉపయోగించి పోలీసులతో మత్స్యకారులను భయపెట్టేందుకు ప్రయత్నించినా వారు లెక్కచేయకపోగా ఆగ్రహంతో మరింత రగిలిపోయారు. చివరకు మీ నాయకులతోనే కమిటీ వేసి న్యాయం చేస్తానని, బల్క్‌డ్రగ్ **పార్కును రద్దు చేసేందుకు పూర్తి స్థాయిలో ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కొద్దిగా శాంతించిన మత్స్యకారులు వాహనానికి దారి ఇచ్చారు. ఆమె మాట్లాడేందుకు** వీలుగా స్టేజ్ వరకు దారి ఇచ్చారు.

పనులు ఆపితేనే మాట్లాడతాం..

హోంమంత్రి అనిత వేదికపై నుంచి మాట్లాడుతూ.. మీ అందరూ కొలిచే నూకతాత సాక్షిగా చెబుతున్నా, బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేసి సమస్యను పరిష్కారం చేసేందుకు హామీ ఇస్తున్నానని చెప్పారు. ఇందు కోసం మీ గ్రామం నుంచి ఒక కమిటీని ఏర్పాటు చేసుకుంటే వారిని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, సీఎం చంద్రబాబు వద్దకు తీసుకెళతానని హామీ ఇచ్చారు. తనను నమ్మాలని దసరా పండుగ అయిన వెంటనే కమిటీ సభ్యులతో డిప్యూటీ సీఎం, సీఎంలతో చర్చలు జరిపించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అయితే బల్క్‌డ్రగ్ పార్కు రద్దు గురించి స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో తమ నిరాహార దీక్ష కొనసాగుతుందని మత్స్యకారులు ముక్తకంఠంతో నినదించారు. బూటకపు హామీలు కాదని తక్షణమే పనులు ఆపాలని నినాదాలు చేశారు. కమిటీలు వేయాల్సిన పనిలేదని, డిప్యూటీ సీఎం, సీఎంలను కలిసే పనే లేదని తెగేసి చెప్పారు. మోసం చేసి తమ దీక్షను విరమింపజేయాలని చూస్తే సహించమన్నారు. చర్చలు జరిగేంత వరకు పనులను ఆపాలని నినాదాలు చేశారు. ఆమె పట్టించుకోకపోవడంతో హోం మంత్రి అనిత డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.

ఆకలి తీర్చని ని‘బంధనాలు’

దివ్యాంగుడు, అతని 80 ఏళ్ల తల్లికి అందని రేషన్



తల్లితో దివ్యాంగుడు సన్యాసినాయుడు

బుచ్చెయ్యపేట: రెండు కళ్లు లేని తనకు, వృద్ధురాలైన తన తల్లికి రెండు నెలలుగా రేషన్ బియ్యం, సరకులు ఇంటికి అందించకపోవడంపై రాజాం గ్రామానికి చెందిన దివ్యాంగుడు నడిపల్లి సన్యాసినాయుడు సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. పుట్టుకతోనే రెండు కళ్లు లేని తనకు, 80 ఏళ్ల వయస్సు కలిగిన తన తల్లికి రెండు నెలలుగా గ్రామానికి చెందిన రేషన్ డీలరు ఇంటికొచ్చి సరకులు ఇవ్వక వస్తులుంటున్నామని ఆయన తహసీల్దార్‌కు ఇచ్చిన అర్జీలో ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, దివ్యాంగుల ఇంటికెళ్లి నిత్యావసర వస్తువులు అందించాలని ప్రభుత్వం చెబుతున్నా తమ గ్రామ రేషన్ డీలర్ అమలు చేయడం లేదని వాపోయారు. గత నెలలో కూడా రేషన్ సరకులు ఇవ్వకపోవడంతో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశానని, అయినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. తనకు న్యాయం చేయాలని తహసీల్దార్‌కు నేరుగా, కలెక్టర్, సీఎం, డిప్యూటీ సీఎం, పౌరసరఫరాల శాఖ మంత్రులకు పోస్టులో ఫిర్యాదు చేశానన్నారు. తహసీల్దార్ లక్ష్మిని దీనిపై వివరణ కోరగా దివ్యాంగుడైన సన్యాసిరావుది సింగిల్ కార్డు కాదని, ఇతని కార్డులో అతని తల్లి పేరు కూడా ఉందని, ఆమె వయస్సు 65 సంవత్సరాలుగా రేషన్ కార్డులో నమోదైందని, అందువల్ల లిస్టులో పేరు రాకపోవడంతో డీలరు ఇంటికెళ్లి సరకులు అందించలేదన్నారు. తల్లి వయస్సు మార్పు చేయించి ఇంటికే రేషన్ సరకులు అందేలా చూస్తామన్నారు.

ఏరియా ఆస్పత్రిలో ఆరోగ్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నాయని, అందులో భాగంగానే మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ శిబిరాల్లో మహిళలకు అన్ని రకాల స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారన్నారు. ఆయుష్మాన్– వయోవందన కార్డు ద్వారా 70 ఏళ్లు పైబడిన వారికి ఏడాదికి రూ.5 లక్షలు విలువైన వైద్య సేవలతో పాటు పెన్షన్ పొందే అవకాశం ఉందన్నారు. ఏరియా ఆస్పత్రిలో రూ.2.10 కోట్లతో వెయిటింగ్ హాల్స్ నిర్మించనున్నట్లు స్పీకర్ పేర్కొన్నారు. ఆస్పత్రిలో ఓపీ నమోదులో జాప్యం జరుగుతున్నందున అదనంగా మరో మూడు కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. గర్భిణులకు నిర్వహించిన సీమంతంలో పాల్గొన్నారు. ఆర్డీవో వి.వి.రమణ, తహసీల్దార్ రామారావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వీరజ్యోతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ సుధాశారద, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు సిహెచ్.పద్మావతి, జెడ్పీటీసీ రమణమ్మ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



తారువలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

- అన్యాయానికి గురైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు సద్వినియోగం చేసుకోవాలి
- మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- తారువలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

దేవరాపల్లి: కూటమి ప్రభుత్వం అరాచకాలతో అన్యాయానికి, వేధింపులకు గురవుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు డిజిటల్ బుక్ అండగా నిలుస్తుందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువలో సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు నమోదు చేసి కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని, బాధితులందరికీ అండగా నిలిచేందుకే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తెచ్చారన్నారు. ఈ డిజిటల్ బుక్‌లో దౌర్జన్యాలు, వేధింపులకు పాల్పడే వారి పేర్లతో పాటు బాధితుల వివరాలను, జరిగిన నష్టాన్ని పొందుపరిచేందుకు వీలుంటుందన్నారు. ప్రతి కార్యకర్త ఈ బుక్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వేధింపులకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టి తగిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, వైస్ ఎంపీపీ పంచాడ సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరదపురెడ్డి లలితానాయుడు, జిల్లా ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు కె.వి.రమణ, పార్టీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన విభాగం అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, ఉపాధ్యక్షుడు బండారు దేముడునాయుడు, ప్రధాన కార్యదర్శి గూడెపు రాము, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు గంగవంశం సంతోష్, ఎంపీటీసీ పోతల వెంకటరావు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం



మునగపాక లింగరాయి గుడిలో సరస్వతీ దేవీ పూజలో పాల్గొన్న చిన్నారులు

విద్యను ప్రసాదించే చల్లని తల్లి సరస్వతీ దేవి. చదువు, సంస్కారాలతోపాటు శారదా మాత జ్ఞానభిక్ష పెడుతుంది. అక్షర లక్షలను అందిస్తుంది. శరన్నవరాత్రుల్లో భాగంగా దుర్గమ్మవారు సోమవారం వాగ్దేవిగా దర్శమిచ్చారు. ఆ తల్లి దీవెనల కోసం విద్యార్థులు ఆలయాల్లో పూజలు చేశారు.

-మునగపాక

‘తాచేరు’ మరణాలు ప్రభుత్వ హత్యలే

- పేట డైవర్షన్ రోడ్డు, మిగిలిన రోడ్లు బాగు చేయకపోతే ప్రజా ఉద్యమం
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్



వడ్డాదిలో సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

బుచ్చెయ్యపేట: తాచేరు నదిలో కాలుజారి కొట్టుకుపోయి ఇద్దరి మృతికి ప్రభుత్వమే కారణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, చోడవరం నియోజకవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఇటీవల భీమునిపట్నం, నర్సీపట్నం (బీఎస్) ఆర్‌అండ్‌బీ రోడ్డులో విజయరామరాజుపేట వద్ద వర్షాలకు కోతకు గురైన తాచేరు డైవర్షన్ రోడ్డు నదిలో కాలు జారి వడ్డాదికి చెందిన రైతు కాళ్ల సుబ్బారావు, పేట గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి ఆడారి రోహిత్ కుటుంబ సభ్యులను ఆయన స్థానిక నాయకులతో కలిసి సోమవారం పరామర్శించారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ డైవర్షన్ రోడ్డు దెబ్బతినడం వల్ల విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. రోడ్డును రెండు నెలల పాటు బాగు చేయకపోవడంతో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి, వ్యవసాయ చేసుకుంటున్న రైతు రైతు తాచేరు నదిలో కొట్టుకుపోయి మృత్యువాత పడ్డారన్నారు. పోయిన ప్రాణాలను ఈ ప్రభుత్వం తీసుకురాగలదా? అని ప్రశ్నించారు. ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని, బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని అన్నారు. విజయరామరాజుపేట తాచేరు డైవర్షన్ రోడ్డును బాగుచేయాలని తమ పార్టీ తరఫున నాయకులతో కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో డైవర్షన్ రోడ్డు పనులు చేపట్టారన్నారు. పేట, వడ్డాది వంతెనలతో పాటు దెబ్బతిన్న బీఎస్ రోడ్డు, ఆర్‌టీ రోడ్డు, వడ్డాది నుంచి ఘాట్‌రోడ్డుకు వెళ్లే రోడ్డు పనులు చేపట్టకపోతే ప్రజలతో కలిసి ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బొమ్మల కొలువు.. సంస్కృతికి నెలవు



యలమంచిలిలో సుసర్ల భాగ్యలక్ష్మి తీర్చిదిద్దిన బొమ్మలు

సాంకేతికత ఎంత పెరిగినా.. కృత్రిమ మేధతో అద్భుతాలు చేస్తున్నా..
అంతరిక్షానికి వెళ్లొచ్చినా కొన్ని సంప్రదాయాలు ఎప్పటికీ పాతబడవు..
చూడ్డానికి బాగుంటాయి.. ఆనందాన్నీ ఇస్తాయి. అలాంటిదే దసరా బొమ్మల కొలువు..
మన సంస్కృతి, సంప్రదాయాలను సజీవంగా నిలుపుతున్న కళాత్మకమైన అందమైన వేదిక.



బొమ్మల కొలువులో పెళ్లి వేడుక



కొట్ర సూర్య గాయత్రి ఇంట్లో కనువిందు చేస్తున్న బొమ్మలు



సుసర్ల భాగ్యలక్ష్మి ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

యలమంచిలి రూరల్: జిల్లా అంతటా దసరా వేడుకలు సరదాగా సాగుతున్నాయి. బొమ్మల కొలువులు ముచ్చట గొలుపుతున్నాయి. యలమంచిలి పట్టణంలోని ఓరుగంటివారి వీధిలో ప్రభుత్వ ఉపాధ్యాయులు సుసర్ల భాగ్యలక్ష్మి, సూర్యప్రకాష్ దంపతులు తమ ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంటోంది. గత ఆరేళ్లుగా వీరు ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఐదు వరుసల్లో సుమారు వెయ్యికి పైగా బొమ్మలతో పెట్టిన బొమ్మల కొలువు చూడ్డానికి గృహిణులు, పిల్లలు, విద్యార్థులు ఉపాధ్యాయ దంపతుల ఇంటికి వెళ్తున్నారు. అలాగే రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో ప్రముఖ పురోహితుడు కొట్ర దీక్షితులు ఇంట్లో గత 10 సంవత్సరాలుగా దసరా పండుగకు బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నారు. దీక్షితులు భార్య సూర్య గాయత్రి ప్రత్యేక శ్రద్ధతో బొమ్మల కొలువు తీర్చిదిద్దుతున్నారు. పురాణేతి హాసాల్లో కనిపించే దేవతల ప్రతిమలు, నవ దుర్గలు, త్రిమూర్తులు, హనుమ, లక్ష్మణ సమేత సీతారాములు, శ్రీనివాసకల్యాణ ఘట్టాలు, రాధాకృష్ణులు, గుడి, గ్రామం, వివాహ క్రతువు, సహపంక్తి భోజనం ఇలా.. వివిధ రకాల బొమ్మల్ని ఇక్కడ కొలువులో ఉంచారు.

ఎన్నెన్నో బొమ్మలు

బొమ్మల కొలువులో దేవుళ్ల బొమ్మలు, కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలతో పాటు ఇతర రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలు కనువిందు చేస్తున్నాయి. పంచాంగం బ్రాహ్మణుడు, పచారీకొట్టు వ్యాపారి, ఆవు దూడ, జంతువులు, పక్షులు, గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే బొమ్మలు ఇలా ఎన్నో రకాల బొమ్మలను కళాత్మకంగా అమర్చారు. ప్రతి ఏటా కొత్త బొమ్మలను జత పరుస్తున్నామని, మన సంస్కృతీ సంప్రదాయాలు భావితరాలకు తెలిసేలా చేయడమే బొమ్మల కొలువు లక్ష్యమని ఏటికొప్పాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సుసర్ల భాగ్యలక్ష్మి చెప్పారు. బొమ్మల కొలువు దసరా, దీపావళి, సంక్రాంతి పర్వదినాల్లో ఏర్పాటు చేయడం పూర్వీకుల నుంచి మనకు సంక్రమించిన సంస్కృతిలో భాగమని తెలుగు అధ్యాపకురాలు కొట్ర సూర్య గాయత్రి చెప్పారు. ఈ కాలం పిల్లలకు బొమ్మల కొలువు ద్వారా సులువుగా మన సంప్రదాయాల గురించి వివరించవచ్చన్నారు.

విశాఖ- అరకు కార్వాన్ వాహనం రెడీ



మహారాణిపేట (విశాఖ): పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విశాఖ నుంచి అరకు వరకు ప్రత్యేక ప్యాకేజీ రూపంలో నడపనున్న కార్వాన్ వాహనాన్ని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ సోమవారం కలెక్టరేట్ వద్ద సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ ఆర్.డి. కల్యాణి, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జె. మాధవి, డివిజనల్ మేనేజర్ జగదీష్ కలిసి కలెక్టర్‌కు కార్వాన్ వాహనం ప్రత్యేకతలను వివరించారు. ఈ ప్రత్యేక వాహనాన్ని త్వరలోనే లాంఛనంగా ప్రారంభించి, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

జీఎస్టీ సంస్కరణలపై నేడు, రేపు అవగాహన

తుమ్మపాల: జీఎస్టీ 2.0 సంస్కరణల్లో భాగంగా వ్యవసాయ రంగంలో రైతులకు కలిగే ప్రయోజనాలపై మంగళ, బుధవారాల్లో రైతు సేవా కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ రంగంలో ఎరువులు, పురుగు మందులు, సూక్ష్మపోషకాలు, బయో పురుగు మందులపై పన్ను 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గిందని, ట్రాక్టర్ విడి భాగాలపై 5 శాతం తగ్గింపు జరిగిందని, వ్యవసాయం, మత్స్య, పశుసంవర్ధక, అనుబంధ రంగాలలో మొత్తం 837 వస్తువులపై 18 నుంచి 5 శాతానికి తగ్గడంతో చిన్న, సన్నకారు రైతులకు ఉపశమనం లభిస్తుందన్నారు. ఈ మేరకు సూపర్ సేవింగ్స్ నినాదంతో మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి వ్యవసాయ యంత్రాల ప్రదర్శన, ర్యాలీలు నిర్వహిస్తామన్నారు.

సేంద్రియ ఉత్పత్తులను వినియోగించండి



సేంద్రియ ఉత్పత్తుల స్టాల్‌ను సందర్శిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: రసాయన ఎరువులు వాడకుండా సహజ సిద్ధంగా పండించే సేంద్రియ పంటల ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో అమృతపాల ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ-(సబ్బవరం) ఏర్పాటు చేసిన సేంద్రియ వ్యవసాయోత్పత్తుల స్టాల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిమితికి మించి రసాయన ఎరువుల వాడకం, ఆ ఉత్పత్తుల వినియోగం వల్ల పర్యావరణం, మనిషి ఆరోగ్యం ప్రభావితమవుతున్నాయన్నారు. సేంద్రియ వ్యవసాయోత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావును ఆదేశించారు.

వాల్తేరులో అభివృద్ధి పనులు వేగవంతం

సాక్షి, విశాఖపట్నం: వాల్తేరు పరిధిలో నిరంతరం సమీక్షలు నిర్వహించి పనులు వేగవంతం చేస్తూ డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని డీఆర్ఎం లలిత్‌బోరా స్పష్టం చేశారు. ఈ మేరకు డివిజన్‌లో అభివృద్ధి కార్యకలాపాలపై సోమవారం ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం వాల్తేరు డివిజన్ ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో ఉందని, త్వరలోనే దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు మారనుందన్నారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరు జనరల్ మేనేజర్లు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ.. అభివృద్ధి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం

- కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం
- పీజీఆర్ఎస్‌కు 232 అర్జీలు

తుమ్మపాల: పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు సకాలంలో సరైన పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆమెతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలు రీఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. మొత్తం 232 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖ 128, పంచాయతీ రాజ్ 23, పోలీస్ 17, పలు శాఖలకు మిగిలిన అర్జీలు నమోదయ్యాయి.

కూటమి అరాచకాలపై ఫిర్యాదుల వెల్లువ

కూటమి నాయకుల అక్రమాలతో తీవ్ర ఇబ్బందులకు గురైన పలువురు బాధితులు కలెక్టరేట్‌కు వచ్చి నిరసన తెలిపారు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు పలు గ్రామాల ప్రజలు తరలివచ్చి కూటమి నాయకుల అనధికారక వ్యవహారాలపై ఫిర్యాదులు చేశారు. ఏడాది కాలంగా గ్రామాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలు పెరిగిపోయాయని, కంపెనీల పేరుతో బాధితులకు చెల్లించే నష్టపరిహార జాబితాల్లో అనర్హులైన కూటమి నాయకుల పేర్లు చేర్చేసి అర్హులను తొలగిస్తున్నారని పలువురు ధ్వజమెత్తారు. అధికారులు కూడా కూటమి నాయకుల తొత్తులుగా మారుతున్నారంటూ కలెక్టరేట్ ఎదుట బాధితులు ఆందోళనకు దిగారు.

నిర్వాసితులకు రైల్వేలో ఉద్యోగమివ్వాలి

రాజుపాలెం రైల్వే వంతెన నిర్మాణంలో భాగంగా భూమి, భవనం కోల్పోతున్న నిర్వాసితులకు ప్రభుత్వ మార్కెట్ విలువకు ఐదు రెట్లు నష్టపరిహారంతో పాటు నిరుద్యోగులైన తమ పిల్లలకు రైల్వేలో ఉద్యోగం అవకాశం కల్పించాలంటూ జీవీఎంసీ విలీన గ్రామం కె.ఎస్.ఆర్.పేటకు చెందిన బాధితుడు గైపూరి భాస్కరరావు కలెక్టర్‌ను వేడుకున్నారు. కష్టాలు పడి నిర్మించుకున్న ఇంటికి నామమాత్రపు నష్టపరిహారం చెల్లించి తమను రోడ్డున పడేసే ప్రయత్నాలకు అంగీకరించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం పునరాలోచన చేసి భూములు కోల్పోతున్న రైతులకు చదరపు గజాల్లో విలువ కట్టి నష్టపరిహారం చెల్లించాలని, తమకు మరో చోట పునరావాసం కల్పించాలని కోరారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ఆర్టీసీలో ప్రత్యేక సీట్ల కోసం వినతి

అనకాపల్లి: ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులకు ప్రత్యేక సీట్లు కేటాయించి, రాయితీలు కల్పించాలని జిల్లా వయో వృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్త్రీశక్తి పథకం అమలు చేయడం వల్ల వృద్ధులకు బస్సుల్లో సీట్లు లేకుండాపోయాయన్నారు. వృద్ధులకు ప్రత్యేక సీట్లు, ప్రయాణంలో 25 శాతం రాయితీ కల్పించాలని వినతిపత్రం అందజేశారు.

ఎస్పీ కార్యాలయానికి 32 అర్జీలు



అర్జీదారుల సమస్య వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు 32 అర్జీలు అందాయి. ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్ట పరిధిలో సమస్యలు పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. భూతగాదాలు-18, కుటుంబ కలహాలు-2, మోసాలకు సంబంధించి-2, వివిధ విభాగాలకు చెందినవి-10 అర్జీలు వచ్చాయన్నారు. చట్ట పరిధిలో ఉన్న అర్జీలకు 7 రోజుల్లో పరిష్కరించాలని దిగువ స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అనధికారిక లేఅవుట్లతో పంట భూములకు నష్టం



అనధికారిక లేఅవుట్ల నుంచి పంట భూములను కాపాడాలంటూ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న తుమ్మపాల రైతులు

అనధికారిక లేఅవుట్లతో వర్షపునీరు నిలిచిపోయి పంటలు మునిగిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, కలెక్టర్ తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ తుమ్మపాలకు చెందిన టీడీపీ, సీపీఎం నాయకులు, రైతులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. తుమ్మపాల సర్వే నంబర్లు 39, 316, 317లలో భూములు ఉన్న టి.అప్పారావు అనే ఆసామి తన భూమిలో అనధికార లేఅవుట్ వేసి వర్షపు నీరు శారదానదిలోకి ప్రవహించకుండా రాతి గోడలు నిర్మించారని కలెక్టర్ దృష్టికి వారు తీసుకెళ్లారు. దీంతో ఎగువన ఉన్న రైతుల భూముల్లో నీరు నిలిచిపోయి పంటలు మునిగిపోతున్నాయని వాపోయారు. మండల రెవెన్యూ, పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పటికే పలుమార్లు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని బాధిత రైతులు చెప్పారు. సుమారు 370 ఎకరాల్లో పంట నష్టం జరుగుతుందని, కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బొడ్డపాటి చినరాజారావు, గొంతిని గంగాజలం, ఎస్.రాజు, పీలా బుజ్జి, గంగిరెడ్ల రమణ, బొడ్డపాటి అప్పలనాయుడు, మహిళలు పాల్గొన్నారు.

భూసేకరణలో టీడీపీ బినామీ జాబితాపై ఆందోళన



టీడీపీ నాయకుల తీరుపై నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

పరిశ్రమల కోసం చేపడుతున్న భూసేకరణలో సాగు రైతుల పేర్లను తొలగించి, టీడీపీ నాయకులు, వారి బినామీల పేర్లతో తయారు చేసిన జాబితాపై తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పీఏసీఎస్ డైరెక్టర్ అడిగర్ల రాంబాబు సాగు రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. మాకవరపాలెం మండలం రాచపల్లి రెవెన్యూ సర్వే నెం.737లో పరిశ్రమల కోసం సేకరిస్తున్న 400 ఎకరాల్లో సాగు రైతులను మోసం చేస్తూ టీడీపీ నాయకులు తమ పేర్లను జతచేస్తు భారీ అవినీతికి పాల్పడుతున్నారని రాంబాబు ఆరోపించారు. ఆరు ఎకరాల భూమి సాగు చేస్తున్న తనకే అన్యాయం జరిగేలా తన పేరుకు బదులు టీడీపీ నాయకుడు అడిగర్ల శ్రీనివాసరావు పేరును సర్వేయర్, వీఆర్వో నమోదు చేశారన్నారు. దీనిపై మండల అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని, సుమారు 20 ఎకరాలు మేర అనర్హులైన వారి పేరున నమోదు చేసి అర్హులైన రైతులను మోసం చేస్తున్నారంటూ పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.నాయుడు, ఉపాధ్యక్షుడు రమేష్, జెమీలు, ఆంజనేయులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల నీటిలో జారిపడి ఇద్దరి మృతి

- తెనుగుపూడిలో చెరువులో మునిగి టెన్త్ విద్యార్థి
- బోయిలకింతాడలో శారదానదిలో పడి మరో వ్యక్తి
- రెండు ఘటనలపై పోలీసుల దర్యాప్తు



పెనగంటి మోహన్‌రావు (ఫైల్)



భర్నికాన అప్పలరాజు(ఫైల్)



చెరువులో నుంచి మోహన్‌రావు మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

దేవరాపల్లి: మండలంలో సోమవారం వేర్వేరు చోట్ల నీటిలో ప్రమాదవశాత్తు జారిపడి ఓ ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనలు రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెనుగుపూడికి చెందిన పదో తరగతి విద్యార్థి పెనగంటి మోహన్‌రావు(15), అతని స్నేహితుడు రొంగలి హేమంత్‌తో కలిసి వారి కళ్లాలకు సమీపంలో తారురోడ్డుకు ఆనుకొని ఉన్న రాజు చెరువు దగ్గరకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లారు. ఈ క్రమంలో మోహన్‌రావు ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో మునిగిపోయాడు. హేమంత్ కేకలు వేయడంతో స్థానికులు కొందరు చెరువులో దిగి బాలుడు ఆచూకీ కోసం గాలించారు. నీటిలో మునిగిన బాలుడిని బయటకు తీయగా అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న 108 అంబులెన్స్ సిబ్బంది వైద్య పరీక్షలు జరిపి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఇంటి నుంచి వెళ్లిన గంటల వ్యవధిలోనే ఒక్కగానొక్క కొడుకు విగతజీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు రమణ, దేవి గుండెలవిసేలా రోదించారు. మృతుడి తండ్రి రమణ ఫిర్యాదు మేరకు దేవరాపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ■ మండలంలోని బోయిలకింతాడలో భర్నికాన అప్పలరాజు(35) సోమవారం ఉదయం శారదానదికి కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారిపడి నదిలో మునిగి మృతిచెందాడు. మృతుడికి భార్య రత్నం, నవీన్, ఝాన్సీ పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య, స్థానిక విద్యా కమిటీ చైర్‌పర్సన్ రత్నం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ పైడిరాజు తెలిపారు. ఈ రెండు గ్రామాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి.

మెరుగు పేరుతో ఘరానా మోసం



రమణ

కూర్మన్నపాలెం: పాత బంగారు, వెండి ఆభరణాలకు మెరుగు పెడతామని నమ్మించి.. మహిళను మోసం చేసిన అంతర్ జిల్లా ఘరానా మోసగాడు ముదేరినవారి రమణను దువ్వాడ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి 24 తులాల బంగారు ఆభరణాలను, నగదును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సౌత్ సబ్ డివిజన్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధి ప్రశాంతినగర్‌లో స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ నివాసం ఉంటున్నారు. అతని భార్య వద్దకు ఈ ఏడాది జూలై 15న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చారు. పాత బంగారు ఆభరణాలకు కొత్త మెరుపు తీసుకువస్తామని, తమ వద్ద ఉన్న నమూనాలను చూపి నమ్మించారు. వారి మాటలు విశ్వసించిన ఆమె.. తన వద్ద ఉన్న సుమారు 24 తులాల బంగారు ఆభరణాలను వారికి ఇచ్చింది. నిందితులు ఆ ఆభరణాలను ఒక మట్టి కుండలో పెట్టి, ఏదో రసాయన ద్రావణంలో ముంచినట్లు నాటకమాడారు. అనంతరం ఆ కుండకు ఒక తెల్లని వస్త్రం చుట్టి.. 'ఈ కుండను 10 రోజుల పాటు ఇంటి ఈశాన్య దిశలో సూర్యరశ్మి తగలకుండా ఉంచి, 11వ రోజున తెరవాలి' అని చెప్పి అక్కడి నుంచి ఉడాయించారు. వారి సూచన మేరకు 11వ రోజున కుండను తెరిచి చూడగా, అందులో బంగారు ఆభరణాలకు బదులుగా కల్లు ఉప్పు ఉండటంతో బాధితురాలు తాను మోసపోయానని గ్రహించింది. కుటుంబ సభ్యుల సాయంతో ఆగస్టు 20వ తేదీన దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో క్రైం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటై, దర్యాప్తు ప్రారంభించాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుల కదలికలను పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో ఈ నెల 29న అనకాపల్లి జిల్లా మారేడుపూడి బస్టాప్ వద్ద ప్రధాన నిందితుడైన ముదేరినవారి రమణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రమణది అన్నమయ్య జిల్లా పాతరాయచోటి. గతంలో కూడా అతను పలు ప్రాంతాల్లో ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ఏ2గా ఉన్న మారేడుపూడి గ్రామానికి చెందిన చప్పిడి నూకరాజు పాత్రపై విచారణ కొనసాగుతోందని సీఐ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి బంగారు హారం-1, బంగారు నెక్లెస్‌లు-2, పెద్ద బంగారు గొలుసు-1, చిన్న బంగారు గొలుసులు-3, బంగారు లాకెట్లు-2, చెవి దిద్దులు-3 జతలు, బంగారు ఉంగరాలు-10, బ్రాస్‌లెట్-01, పాపిడి బిళ్ల-1, రూ.5300 స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన క్రైం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

రేషన్ సరకుల కోసం 12 కి.మీ. నడవాలా?

చింతలపూడిలో డిపో ఏర్పాటు చేయాలని గిరిజనుల ఆందోళన



రేషన్ డిపో కోసం ఆందోళన చేస్తున్న చింతలపూడి పంచాయతీ గిరిజనులు

దేవరాపల్లి: చింతలపూడి పంచాయతీలో ప్రత్యేక రేషన్ డిపో ఏర్పాటు చేయాలని స్థానిక గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రత్యేక రేషన్ డిపో ఏర్పాటు చేయాలని కోరుతూ చింతలపూడి, సమ్మెద, వంతెవానిపాలెం గిరిజనులు సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి వినతిపత్రం అందజేశారు. వీరి ఆందోళనకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు మాట్లాడుతూ తామరబ్బ, చింతలపూడి పంచాయతీలకు కొన్నేళ్లుగా తామరబ్బ పంచాయతీ పరిధిలోని ముకుందపురంలోని రేషన్ డిపోలో సరకులు పంపిణీ చేస్తుండడంతో చింతలపూడి పంచాయతీలోని 12 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వంతెవానిపాలెం, బోడిగరువు, నేరెళ్లపూడి గ్రామాలకు సుమారు 12 కిలోమీటర్ల దూరం ఉంటుందని, ప్రతి నెలా సరకుల కోసం కాలి నడకన వెళ్లి నరకయాతన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇదే అంశంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా తహసీల్దార్ విచారణ జరిపి చింతలపూడి పంచాయతీలో ప్రత్యేక రేషన్ డిపో ఏర్పాటు చేయాలని నివేదిక ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకుని తమ సమస్యను పరిష్కరించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.శ్రీను, ఎం. ఎర్రునాయుడు, డి.దేవి, డి.ఉమ, వి.వెంకటేష్, టి.రాములమ్మ, కె.గౌరునాయుడు తదితర గిరిజనులు, మహిళలు పాల్గొన్నారు.

'జూనియర్ అథ్లెటిక్స్' చాంపియన్ విశాఖ



బహుమతి అందుకుంటున్న విశాఖ అథ్లెట్లు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో విశాఖ అథ్లెట్లు బి.ఇషానా, కె.ఆర్.వి.ఎం.కుమార్, బి.శైలజ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి వ్యక్తిగత చాంప్‌లుగా నిలిచారు. ఈ పోటీల్లో విశాఖ జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కూడా కైవసం చేసుకుంది. సోమవారంతో గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో ముగిసిన ఈ పోటీలను సబ్ జూనియర్ (అండర్-14, 16), యూత్ (అండర్-18), జూనియర్ (అండర్-20) బాలబాలికల విభాగాల్లో ట్రాక్ అండ్ ఫీల్డ్ అంశాల్లో నిర్వహించారు. బాలికల అండర్-14 విభాగంలో ఇషానా, అండర్-18 విభాగంలో శైలజ, బాలుర అండర్-16 విభాగంలో కుమార్ తమ విభాగాల్లో వ్యక్తిగత చాంపియన్‌షిప్‌లు సాధించారు. అలాగే విశాఖ జిల్లా జట్టు 269 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. బాలుర చాంపియన్‌షిప్‌ను 156 పాయింట్లతో విశాఖ కైవసం చేసుకోగా, బాలికల చాంపియన్‌షిప్‌ను 113 పాయింట్లతో సాధించింది.

పీలా...ఢీలా

'స్థాయీ సంఘం'లో రచ్చ రచ్చ

- మేయర్‌పై గుర్రుమన్న కూటమి భాగస్వామి బీజేపీ కార్పొరేటర్
- పర్సనల్‌గా మాట్లాడుకుందామన్న మేయర్..
- మీతో మాకు పర్సనల్ ఏంటి? అని నిలదీసిన వైనం
- సొంత సభ్యులతోనే మేయర్‌కు చుక్కెదురు



స్థాయి సంఘ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్, స్థాయి చైర్మన్ పీలా శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘం సమావేశం మేయర్, స్థాయీ సంఘం చైర్మన్ పీలా శ్రీనివాసరావు, బీజేపీ కార్పొరేటర్ గంకల కవిత మధ్య తీవ్ర వాగ్వాదానికి వేదికైంది. సమావేశానికి కమిషనర్ వస్తారని మేయర్ చెప్పగా, 'కమిషనర్ ఊర్లో లేరని మీకు తెలియదా? లేక తెలిసీ అడుగుతున్నారా?' అంటూ కవిత నిలదీశారు. దీనికి మేయర్ స్పందిస్తూ మీరు కూర్చోండి. ఏమైనా ఉంటే వ్యక్తిగతంగా మాట్లాడుకుందాం అనడంతో వివాదం మరింత రాజుకుంది. మీతో మాకు పర్సనల్ ఏముంటాయని ప్రశ్నించారు. మీరు మేయర్‌గా కాకుండా కేవలం చైర్మన్‌గా మాత్రమే వచ్చారు. మేము కూడా ప్రజలతో ఎన్నికయ్యాం. సమావేశం సోమవారం అయితే మాకు ఆదివారం చెబుతారా? మీరు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. దీనికి పీలా శ్రీనివాసరావు ఇది అత్యవసర సమావేశం. ఇష్టం లేని వారు వెళ్లిపోవచ్చు అని బదులిచ్చారు. అంతేకాకుండా, స్థాయీ సంఘంలో మీకు స్థానం కల్పించింది నేను, నా పార్టీ నుంచి మీకు అవకాశం ఇచ్చాను అని మేయర్ తీవ్రంగా మండిపడ్డారు. మీరు మాకు క్లాసులు చెబుతారా? మీ వ్యవహార శైలి బాగాలేదు అంటూ కవిత..మేయర్‌పై విరుచుకుపడ్డారు.

జిరాయితీ భూమికి ప్లానింగ్ ఎలా?

శానాపతి వసంత మాట్లాడుతూ జిరాయితీ భూమికి అధికారులు ప్లానింగ్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. దానికి చైర్మన్ స్పందిస్తూ, సంబంధిత అధికారులు లేరు, ఆ విషయం వదిలేయండి.. అని చెప్పగా, సభ్యురాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో కూడా నేను స్థాయీ సంఘంలో ఉన్నాను, అప్పుడు అధికారులంతా అందుబాటులో ఉండేవారు. ఇప్పుడు అధికారులు లేకపోతే ఎలా? అని మేయర్‌ను ప్రశ్నించారు. బంజరు భూమిలో రోడ్డు వేయగలమా అని ప్రశ్నిస్తూ, దీనిపై విచారణ చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులు ఎక్కడ?

అనేకసార్లు విజ్ఞప్తులు చేసినా, వార్డుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్ లేదని అధికారులు చెబుతున్నారని పలువురు సభ్యులు మండిపడ్డారు. నవంబర్‌లో జరిగే సదస్సుకు రూ. 40 కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. 'నగరాభివృద్ధి, సుందరీకరణకు మేము వ్యతిరేకం కాదు. కానీ మా వార్డుల పరిస్థితి ఏమిటి? మరో నాలుగైదు నెలల్లో పదవీకాలం ముగుస్తుంది, తిరిగి ఎన్నికలకు వెళ్లాలంటే మేము చేసిన అభివృద్ధి చూపించాలా వద్దా?' అని ప్రశ్నించారు. కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూడా తాము విఫలమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

విలీన గ్రామాలకు అన్యాయం?

మరో సభ్యుడు మొల్లి ముత్యాలు జీవీఎంసీ పరిధిలోని విలీన గ్రామాల అభివృద్ధిపై ప్రశ్నలు లేవనెత్తారు. 'జీవీఎంసీ అంటే కేవలం నగరం మాత్రమే కాదు, విలీన గ్రామాలూ ఉన్నాయి. కేవలం నగరంలోనే సుందరీకరణ, అభివృద్ధి పనులు చేపడితే విలీన గ్రామాలను ఎందుకు కలుపుకున్నట్లు? అని ఆయన ప్రశ్నించారు. శ్మశాన వాటికలకు కూడా రక్షణ లేకుండా పోయిందని, అభివృద్ధి పనులు అడిగితే బడ్జెట్ లేదని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్‌లో జరిగే సదస్సుకు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టడానికి మాత్రం బడ్జెట్ ఉంటుందా అని ఆయన దుయ్యబట్టారు.

వైఎస్సార్‌సీపీ సభ్యురాలి ఆగ్రహం

సమావేశం ప్రారంభానికి ముందు వైఎస్సార్ సీపీ సభ్యురాలు సాడి పద్మారెడ్డి కూడా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, ముఖ్యంగా సెక్రటరీ మేయర్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారు. స్థాయీ సంఘం సమావేశాల విధివిధానాలు ఏమిటో తెలియజేయాలని ఆమె డిమాండ్ చేశారు. సమావేశం ఉందని సోమవారం ఉదయం తనకు ఫోన్ చేసి చెప్పారని, అజెండా అంశాలు చదవడానికి కూడా సమయం ఇవ్వలేదని ఆమె అన్నారు. గత సమావేశంలో అడిగినా ఇప్పటివరకు విధివిధానాలు తనకు ఇవ్వలేదని ఆరోపించారు. తమ వార్డులు, జోన్లలో చేపట్టే ఏ కార్యక్రమమైనా తన దృష్టికి తీసుకురావాలని అధికారులను కోరారు.

అన్ని అంశాలకు సభ్యుల ఆమోదం

ఈ తీవ్ర చర్చలు, నిరసనల అనంతరం, సమావేశంలో చర్చకు వచ్చిన 91 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. వీటిలో ముఖ్యంగా సీఐఐ భాగస్వామ్య సదస్సు-2025కు సంబంధించిన అంశాలున్నాయి. ఈ సందర్భంగా మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ రూ. 27.60 కోట్ల అంచనా వ్యయంతో నగర సుందరీకరణ, అభివృద్ధి పనులు, రూ. 5.3 కోట్ల అంచనా వ్యయంతో ఇతర ఇంజినీరింగ్ పనులకు సభ్యులు ఆమోదం తెలిపారని చెప్పారు. ప్రజా ఆరోగ్య విభాగానికి సంబంధించి పారిశుధ్య కార్మికుల జీతాలకు కూడా ఆమోదం లభించిందని తెలిపారు. సమావేశంలో ప్రధాన ఇంజినీర్ పీవీవీ సత్యనారాయణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోన్-1 జోనల్ కమిషనర్ ఇప్పినాయుడు, 6వ జోన్ జోనల్ కమిషనర్ విజయశంకర్, పర్యవేక్షక ఇంజినీర్లు సంపత్‌కుమార్, రాయల్‌బాబు, గోవిందరావు, కె.శ్రీనివాసరావు, కార్యనిర్వాహక ఇం.ఇనీర్లు, ఏఎమ్‌వోహెచ్‌లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా



బయ్యవరం వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సీఐ స్వామినాయుడు

కశింకోట: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించకుంటే జరిమానా తప్పదని సీఐ అల్లు స్వామినాయుడు హెచ్చరించారు. మండలంలోని బయ్యవరం వద్ద హైవేలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానా విధించారు. హెల్మెట్ ధరించని వాహన చోదకులకు రూ.1035 జరిమానా విధించారు. ఈ సందర్భంగా వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపినా, నో పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలిపినా జరిమానా తప్పదన్నారు. నిబంధనలు పాటించకోవడం వల్ల పలు రోడ్డు ప్రమాదాలకు కారణంగా నిలుస్తుందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య క్రమేపి పెరుగుతుందన్నారు. దీన్ని అదుపు చేయడానికి ట్రాఫిక్ నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన ర్యాలీ



సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న కార్మికులు

కశింకోట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కశింకోటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి. వరలక్ష్మి మాట్లాడుతూ మే డే స్ఫూర్తికి వ్యతిరేకమైన కార్మిక విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని విమర్శించారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను నాన్ లేబర్ కోడ్‌లుగా కుదించి పరిశ్రమల యాజమాన్యాలకు అనుకూలంగా కొత్త చట్టాలను ప్రవేశ పెట్టిందన్నారు. వీటిని కార్మిక సంఘాలన్ని వ్యతిరేకించి దేశ వ్యాప్త సమ్మె చేసినా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. పైగా మహిళలకు రాత్రి షిఫ్టుల్లో పని చేయాలని, 13 గంటల పని విధానాన్ని అమలు చేస్తూ చట్టసభల్లో చట్టం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. వీటిని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల ప్రతినిధులు శ్రీదేవి, శివలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి

యలమంచిలి రూరల్: పట్టణంలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో పలు సమస్యలపై సోమవారం కాలనీవాసులు కలెక్టర్ విజయ కృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. సామాజిక కార్యకర్త జోగా వెంకట రమణ, చుక్కల శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో కాలనీవాసులు తమ కాలనీ(18వ వార్డు)లో పెద్ద వ్యవసాయ బావి గట్టు ఎత్తు పెంచి, రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 190 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	5,100	5,100
మొదటి రకం	4,000	4,920
రెండో రకం	3,750	4,200
మూడో రకం	3,600	3,740

అనకాపల్లి సినిమాలు

రాజా	: ఓజీ
సత్యనారాయణ స్క్రీన్-1	: కిష్కింధపురం
సత్యనారాయణ స్క్రీన్-2	: టన్నెల్
పర్తిసాయి	: ఓజీ
షిర్డిసాయి	: ఓజీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 65 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-15, బీ పాజిటివ్-16, ఓ పాజిటివ్-28, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 389 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

భగ్గుమన్న చిరువ్యాపారులు

- దుకాణాల తొలగింపుపై ఆగ్రహం
- ప్రత్యామ్నాయ మార్గం చూపాలని డిమాండ్
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జోనల్ కార్యాలయం వద్ద ధర్నా



అనకాపల్లి జెడ్సీ చక్రవర్తికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ శ్రేణులు, చిరువ్యాపారులు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం చిరువ్యాపారులపై ఉక్కుపాదం మోపింది. దశాబ్దాలుగా రోడ్డుకు ఇరువైపులా బడ్డీకొట్లు పెట్టుకుని జీవనోపాధి పొందుతున్న వారిపై జేసీబీల సహాయంతో విరుచుకుపడింది. ఉన్నపళంగా దుకాణాలను తొలగించింది. కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో ఆర్థికంగా నష్టపోవడమే గాకుండా రోడ్డున పడ్డామని వారంతా ఆందోళనకు దిగారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో స్థానిక జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. జోనల్ కమిషనర్ కె.చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ చిరువ్యాపారుల ఓట్లతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వారి పొట్టకొట్టడం అన్యాయమన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వేలాది పోస్టులను భర్తీచేయకపోవడంతో నిరుద్యోగులు రహదారులపై చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని వాపోయారు. పేదోడి పొట్టను కొట్టిన ప్రభుత్వాలు ఎక్కడ నిలబడలేదన్నారు. చిరువ్యాపారులకు అండగా వైఎస్సార్‌సీపీ నిలబడి పోరాటాలు చేస్తుందన్నారు. దసరా నవరాత్రులు ముగిసిన తర్వాత మరోసారి రహదారులపై దుకాణాలను తొలగింపునకు సిద్ధమవుతున్నట్టు తెలిసిందన్నారు. దీనికి వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు.

పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ రెక్కాడితేగాని డొక్కాడని చిరువ్యాపారాలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. వారికి జరిగిన నష్టానికి అధికారులు, కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తోపుడు బళ్లు, బడ్డీలు తొలగించడం వల్ల జీవనోపాధి కోల్పోయి నిరాశ్రయులయ్యారన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రధాన రహదారుల్లోని వర్తక, వాణిజ్య దుకాణాల్లో సెల్లార్లను పార్కింగ్‌కు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా జోనల్, పోలీస్ అధికారులు దృష్టి సారించాలన్నారు.

80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ మాట్లాడుతూ చిరువ్యాపారులు రహదారులపై రోజువారి ఫైనాన్స్, డ్వాక్రా, బ్యాంకు రుణాలు తీసుకుని వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఇప్పుడు దుకాణాలు తొలగించడం వల్ల వాటిని ఎలా తీర్చుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పల్లేల సాయి కిరణ్, 80వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు సిద్దార్థ, ఎన్టీఆర్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ మున్నూరు శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు విల్లూరి శివసూర్యనారాయణ, నడిశెట్టి మధు, నక్కా ప్రభాకర్, లక్కోజు రాంబాబు, కాండ్రేగుల హైమావతి, కోన ఉమ, నడిశెట్టి మధు, చిరువ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం లేకుండా దుకాణాలు తొలగించారు



ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా దుకాణాలు తొలగించడం అన్యాయం. అనకాపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో 15 సంవత్సరాలుగా సెలూన్ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. అన్ని ఖర్చులు పోయి రోజుకు రూ.500 వరకూ వస్తుంది. ఒక్కసారిగా బడ్డీని తొలగించడం వల్ల పూర్తిగా జీవనోపాధి కోల్పోయాం.

– కె.సతీష్, చిరువ్యాపారి, రైల్వే అండర్ బ్రిడ్జి, అనకాపల్లి

ప్రభుత్వమే ఆదుకోవాలి



గాంధీనగరంలో ప్రేమ సమాజం వద్ద 40 సంవత్సరాలుగా సైకిల్ రిపేరు దుకాణం నిర్వహిస్తున్నాను. నా వ్యాపారం వల్ల వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేవు. అయినప్పటికీ బడ్డీని జేసీబీ సహాయంతో తొలగించడం వల్ల ముక్కముక్కలుగా విరిగిపోయింది. బడ్డీకి అయిన ఖర్చు ప్రభుత్వమే చెల్లించాలి. ప్రత్యామ్నాయ మార్గం చూపాలి.

– వడ్డి శ్రీనివాసరావు, గాంధీనగరం, అనకాపల్లి

టిఫిన్ కొట్టు, పాన్‌షాప్ తొలగించారు



భీమునిగుమ్మంలో 20 సంవత్సరాలుగా టిఫిన్ కొట్టు, పాన్‌షాప్‌ను పెట్టుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాను. నా చదువుకు ఏ ఉద్యోగం దొరక్కపోవడంతో స్వయం శక్తితో ఎదగాలని దృఢ సంకల్పంతో వ్యాపారం చేసుకుంటున్నాను. ఇప్పుడు ఉన్నపళంగా నా దుకాణం తొలగించారు. నేను నా భర్త, ఇద్దరు పిల్లలు ఎలా బతకాలో అర్థం కావడంలేదు.

– కట్టా తులసి, భీమునిగుమ్మం, అనకాపల్లి

మహిళల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ



ఎన్టీఆర్ ఆస్పత్రిలో ప్రమాణం చేస్తున్న డాక్టర్లు

అనకాపల్లి టౌన్: కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, దీనిలో భాగంగా స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎంపీ సీఎం రమేష్ పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ దేశ వ్యాప్తంగా 80 వేల హెల్త్ క్యాంపులు నిర్వహించి మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యవంతమైన స్త్రీ–శక్తిమంతమైన కుటుంబం అంటూ ప్రమాణం చేశారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మెడికల్ క్యాంప్‌ల్లో మహిళలకు వచ్చే క్యాన్సర్, బీపీ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి, ఆయుష్ విభాగం వైద్యాధికారి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలపై ఫిర్యాదు

అచ్యుతాపురం రూరల్ : దొప్పెర్ల గ్రామంలో అక్రమంగా చెరువు మట్టి తవ్వకాలు చేస్తున్నారని గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దొప్పెర్ల గ్రామ రెవెన్యూ పంచాయతీ సర్వే నంబర్ 40లోని గంగునాయుడు చెరువులో అనధికారికంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కనకదుర్గమ్మ సేవలో అమర్‌నాథ్



కోట్నివీధిలో అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న 84వ వార్డు ఇన్‌చార్జి రాఘవ, కమిటీ సభ్యులు



వెదురుపర్తిలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న మలసాల కుమార్‌రాజా

అనకాపల్లి: స్థానిక కోట్నివీధిలో పవర్ ఆఫ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు శాలువాతో ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, ఎన్టీఆర్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ మున్నూరు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కోరుకొండ రమేష్, సేనాపతి సాయి, కేతిరెడ్డి ప్రసాద్, పిన్నింటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని వెదురుపర్తిలో దుర్గాదేవి విగ్రహాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్‌రాజా దర్శించుకుని పూజలు చేశారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, వెదురుపర్తి వైఎస్సార్ సీపీ నాయకులు ఎ. నాగు, హరి,ఎ. జగదీష్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లికి ప్రణమిల్లి..



నూకాంబిక ఆలయంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను



సతకంపట్టులో సరస్వతిదేవి పూజలు చేస్తున్న విద్యార్థులు

అనకాపల్లి: దసరా ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు సోమవారం దుర్గాదేవి అమ్మవారు సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయంలో విల్లూరి నానాజీ మాధురి లక్ష్మి, కర్రి వెంకటరమణబాబు లక్ష్మితులసి దంపతులు పారిశుధ్య కార్మికులకు, విద్యార్థులకు బుక్స్, బూట్లు, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. స్థానిక నిదానందొడ్డి కామాక్షిదేవి ఆలయంలో స్వర్ణ హస్త కంకణం సన్మాన గ్రహీత డాక్టర్ సప్పిభారతి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర హరికథా గానం నిర్వహించారు. రాత్రికి అమ్మవారి సారె ఊరేగింపు నిర్వహించి, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. స్థానిక మెయిన్‌రోడ్డులో కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్ధనిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వంద కేజీల వెండితో తయారు చేసిన రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పిళ్లా సూర్య జనార్దన్ విజయలక్ష్మి, కర్రి అప్పారావు లలితా శివజ్యోతి దంపతులు ఆర్థిక సాయంతో భవానీ భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గవరపాలెం గౌరీ పంచాయతీ దేవాలయంలో గౌరీదేవి భద్రకాళిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. సత్యనారాయణపురం కనకదుర్గమ్మ కొండపైన అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కశింకోట: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక జాతీయ రహదారి వద్ద కనకదుర్గ ఆలయంలోని దుర్గాదేవి, శివాలయంలోని సర్వమంగళాంబ అమ్మవార్లను సరస్వతీదేవిగా అలంకరించారు. శివాలయంలో అర్చకులు విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. స్థానిక కనక మహాలక్ష్మి వీధిలో నెలకొల్పిన దుర్గాదేవి విగ్రహం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. తాళ్లపాలెం కూడలిలో సింహంపై కొలువై ఉన్న దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయం వద్ద సరస్వతీదేవి రూపంలో నెలకొల్పిన దుర్గాదేవి, పాలకేంద్రం వద్ద నెలకొల్పిన దుర్గాదేవి విగ్రహాల వద్ద కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వంద కేజీల వెండి రథంపై కన్యకాపరమేశ్వరి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

సమ్మెలో వైద్యులు.. నిలిచిన సేవలు



కశింకోట పీహెచ్‌సీలో వైద్య సేవల కోసం నిరీక్షిస్తున్న ప్రజలు



వైద్యుల సమ్మెతో వెలవెలబోతున్న కశింకోట పీహెచ్‌సీ

కశింకోట: మండలంలోని రెండు పీహెచ్‌సీల్లో వైద్యుల సమ్మెతో సేవలు నిలిచిపోయాయి. రోగులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా కశింకోట పీహెచ్‌సీలో డాక్టర్ తిరుపతిరావు, యు. యశోద, తాళ్లపాలెం పీహెచ్‌సీలో ఎ. మనీషా, సుమ నల్ల బ్యాడ్జీలు ధరించి సమ్మెలో పాల్గొన్నారు. అత్యవసర సేవలు మినహా మిగిలిన ఓపీ సేవలు బహిష్కరించారు. సమస్యలు పరిష్కరించే వరకు తమ సమ్మె కొనసాగుతుందని వైద్యులు పేర్కొన్నారు. ఒక్కొక్క పీహెచ్‌సీకి వంద మంది వరకు రోగులు వచ్చారు. తాళ్లపాలెంలో సంత కావడంతో ఇతర దూర గ్రామాల నుంచి వైద్యం కోసం వచ్చిన ప్రజలు ఇబ్బంది చెందారు. వారిలో కొంతమందికి ఫార్మసిస్టులు, ఆరోగ్య సిబ్బంది తమకు ఉన్న పరిజ్ఞానంతో మందులు అందజేసి సరిపెట్టాల్సి వచ్చింది.

న్యాయమైన సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె

కశింకోట: ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించే వరకు వైద్యుల సమ్మె కొనసాగుతుందని ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కశింకోట పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. తిరుపతిరావు తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ తాము ఉద్యోగంలో చేరినప్పుడు ఉన్నత విద్య అభ్యసించడం కోసం తగినంత కోటా ఇస్తామని చెప్పిన ప్రభుత్వం దాన్ని వెనక్కి తీసుకుందని, ఇది చాలా అన్యాయమన్నారు. సీహెచ్‌సీల్లో పని చేసే వైద్యులకు మూడేళ్లకే పదోన్నతలు కల్పిస్తున్న ప్రభుత్వం రెండు దశాబ్దాలుగా పని చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులకు మాత్రం పదోన్నతి కల్పించకుండా తీరని అన్యాయం చేస్తోందన్నారు. దీనివల్ల పదోన్నతి లేకుండా కొందరు వైద్యులుగానే పదవీ విరమణ చేయాల్సిన దుర్గతి ఏర్పడుతుందన్నారు. ఏజెన్సీలో పని చేస్తున్న వైద్యులకు ట్రైబల్ అలవెన్స్ తగినంతగా అందించడం లేదన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వకుండా కాలయాపన చేస్తోందన్నారు. మూడేళ్లుగా పల్లె, వీధులకు వెళ్తున్న 104 చంద్రన్న సంచార చికిత్స వైద్యులకు నెలకు రూ.5 వేల టీఏ ఇవ్వలేదన్నారు. వీటితోపాటు మరిన్ని సమస్యలు పరిష్కరించుకోవడానికి సమ్మె చేయాల్సి వస్తోందన్నారు. పీహెచ్‌సీ వైద్యురాలు యశోద పాల్గొన్నారు.



డాక్టర్ తిరుపతిరావు

తీరని యూరియా కష్టాలు

- కశింకోట, బయ్యవరంలో గంటల కొద్దీ నిరీక్షణ
- స్లిప్పుల కోసం రైతుల బారులు



యూరియా స్లిప్పుల కోసం రైతుల బారులు



కశింకోట మండల వ్యవసాయ కార్యాలయం వద్ద యూరియా స్లిప్పుల కోసం రైతుల బారులు

కశింకోట: మండల రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. యూరియా కోసం మండల వ్యవసాయ కార్యాలయం వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. సోమవారం కశింకోట, బయ్యవరంలో చెరో 12 మెట్రిక్ టన్నుల వంతున యూరియాను అధికారుల పర్యవేక్షణలో పంపిణీ చేపట్టారు. ఇందు కోసం ముందుగా స్లిప్‌లను స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేశారు. ఉదయం 8 గంటల నుంచి రైతులు వ్యవసాయ కార్యాలయం వద్ద బారులు తీరి, నిరీక్షించి స్లిప్పులు పొంది ఎరువులు తీసుకోవలసిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. గతంలో ఆధార్ కార్డు ఉంటే యూరియా అందించే వారు. ఇప్పుడు భూమి పట్టాదారు పాసు పుస్తకం నకళ్లుగాని, భూమి వివరాలుగాని తెలియజేస్తే ఇస్తున్నారు. దీని వల్ల కౌలు రైతులు పట్టాదారు పాసు పుస్తకం లేక ఎరువు ఇవ్వడానికి వెనుకడుగు వేస్తుండటంతో ఇబ్బంది చెందక తప్పలేదు. మండల రైతులకు తప్ప ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు ఇక్కడ నిల్వ సరిపోదని యూరియా పంపిణీ నిరాకరించారు. దీంతో వారు తీవ్ర నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు.

యూరియా ఉంటుందో? లేదో?



వరి సాగు చేస్తున్నాను. యూరియా లేక గతంలో డీఏపీ వేయాల్సి వచ్చింది. ఆధార్ కార్డు ఉంటే గతంలో యూరియా ఇచ్చే వారు. ఇప్పుడు పట్టాదారు పాసు పుస్తకం కావాలంటున్నారు. దాన్ని తెచ్చేలోగా యూరియా నిల్వ ఉంటుందో? లేదో? దిగులుగా ఉంది.

– పి. పెంటారావు, రైతు, కశింకోట

పట్టాదారు పాసు పుస్తకం కావాలంట



భూమిని కౌలుకు సాగు చేస్తున్నాను. పట్టాదారు పాసు పుస్తకం ఉంటేనే యూరియా ఇస్తామంటున్నారు. కౌలుకు చేస్తున్న నాకు పట్టాదారు పాసు పుస్తకం కావాలంటే ఎలా వస్తుంది. దానితో సంబంధం లేకుండా యూరియాను అందించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

–కశిరెడ్డి అప్పారావు, కౌలు రైతు, కశింకోట

గంటల కొద్దీ నిరీక్షణ



మూడెకరాల్లో ఖరీఫ్ వరి వేశాను. గతంలో ఒక బస్తా యూరియా ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ వేయడానికి పది కిలో మీటర్ల దూరం నుంచి వచ్చి యూరియా కోసం మూడు గంటలు పైగా కాపలా కాసి నిరీక్షించాల్సిన పరిస్థితి. దీని వల్ల ఖర్చులు, కాలం వృథా. తమ కష్టాలు తీరడానికి ఎక్కడికక్కడే రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జోగా సత్తిబాబు , రైతు, జోగారావుపేట

వారపు సంతకు దసరా కళ

- జోరుగా మేకలు, గొర్రెల అమ్మకాలు



గొర్రెలు,మేకలను కొనుగోలు చేసి వ్యాన్లలో తరలించుకుపోతున్న వ్యాపారులు



ఆశించిన ధర కోసం ఎదురు చూస్తున్న గొర్రెల, మేకల విక్రయదారులు



తాళ్లపాలెం వారపుసంతలో గొర్రెలు, మేకల విక్రయాలు

కశింకోట: తాళ్లపాలెంలో సోమవారం వారపు సంతకు దసరా కళ ముందుగానే వచ్చింది. దసరా ముందు రోజు సంత కావడంతో మేకలు, గొర్రెల అమ్మకాలు జోరుగా సాగాయి. రూ.కోటి పైగా అమ్మకాలు సాగినట్లు సమాచారం. రూ.8 వేల నుంచి రూ.35 వేల వరకు పరిమాణం అనుసరించి అమ్మకాలు సాగాయి. ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు కాకినాడ జిల్లా నుంచి గొర్రెలు, మేకలు 1500 వరకు అమ్మకానికి వచ్చాయి. దీంతో సంత కిక్కిరిసిపోయింది. మొదట్లో ధరలు తక్కువగా ఉన్నా క్రమేపి గిరాకీ ఏర్పడటంతో ఎక్కువ ధరలకు అమ్మకాలు సాగాయి. దీంతో పెంపకందారులు, రైతులు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు. మధ్యాహ్నానికి గొర్రెలు, మేకలు అమ్మకాలు జరిగి సంత ఖాళీ అయింది. చివరగా ఆశించిన ధర లేని వారు మాత్రం కొందరు తిరిగి మరో సంతలో విక్రయించుకోవడానికి తమ ఇళ్లకు వాహనాల్లో తరలించుకుపోయారు.